సాక్షి
ప్రకాశం
మంగళవారం । 29 । జూలై । 2025





**కూటమి ప్రభుత్వం మోసానికి కేరాఫ్ అడ్రస్**

కూటమి ప్రభుత్వం మోసానికి కేరాఫ్ అడ్రస్ అని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. - 8లో..



**నేతల విగ్రహాలకు ఎసరు..!**

ఒంగోలు నగరంలో రంగారాయుడు చెరువు వద్ద ఉన్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, బాపూజీ కాంప్లెక్స్ ముందున్న కొణిజేటి రోశయ్య విగ్రహాలు తొలగించేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో రంగం సిద్ధం చేశారు. - 8లో..

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
36 /27

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### 14 ఏళ్ల నిరీక్షణకు తెర

● కొండపి పంచాయతీకి ఎన్నికల నోటిఫికేషన్

**కొండపి:** కొండపి పంచాయతీ ఎన్నికల కోసం దాదాపు 14 సంవత్సరాల నిరీక్షణకు తెరపడింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ కొండపి పంచాయతీకి ఎన్నికల నోటిఫికేషన్ సోమవారం విడుదల చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ కొండపి పంచాయతీకి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. అదే రోజు ఉదయం గం.10:30 నుంచి ఆగస్టు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 2వ తేదీ ఉదయం 8 గంటల నుంచి, 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్క్రూటినీ ప్రక్రియ జరుగుతుందని, నాలుగో తేదీ తిరస్కరణకు గురైన నామినేషన్ల జాబితా విడుదల, 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, మూడు గంటల తర్వాత అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఎన్నిక అవసరమైతే 10వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తామని, రీపోలింగ్ అవసరమైతే 12వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించి గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తామని తెలిపారు.

### ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించండి

● ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నంద కిశోర్



ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కిశోర్‌తో స్థానిక డాక్టర్లు

**మార్కాపురం:** డాక్టర్లు ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిశోర్ స్థానిక వైద్యులకు సూచించారు. సోమవారం ఆయన మార్కాపురం ఐఎంఏ కార్యాలయాన్ని సందర్శించి డాక్టర్లతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని, ఇందుకోసం గ్రామాల్లో పట్టణాల్లో సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రత్యేక రోజుల్లో బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. మార్కాపురం చుట్టుపక్కల ఉన్న ఐఎంఏ బ్రాంచ్ సభ్యులతో మాట్లాడుతూ సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వంశీకృష్ణ, ఫణీంద్రారెడ్డి, శివశంకర్, రాంబాబు, హర్ష, మాధవరావు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన ఎనిమిదో రౌండ్ పొగాకు కొనుగోళ్లు



వేలాన్ని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య

**కొండపి:** స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారంతో 8వ రౌండ్ పొగాకు కొనుగోలు ప్రక్రియ ముగిసింది. ఎనిమిదో రౌండ్ ప్రారంభం నుంచి రోజుకు సగటుగా 350 బేళ్లకు పైన తిరస్కరించారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రౌండ్ చివర దశకు చేరుకునేసరికి కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతుల బేళ్లను అధిక సంఖ్యలో తిరస్కరించడంతో వేలం ప్రక్రియ నిలిపేశారు. ధర తగ్గించైనా పొగాకు బేళ్లను కొనుగోలు చేయాలని వేలం ప్రక్రియను నిలిపేశారు. గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే బేళ్ల తిరస్కరణ పిడుగుపాటులా ఉంటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9వ రౌండ్ ప్రారంభం నుంచైనా పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**412 బేళ్ల తిరస్కరణ:**

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 412 బేళ్ల తిరస్కరణ గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని వెన్నూరు చిన్న వెంకన్నపాలెం గ్రామాలకు చెందిన రైతులు 911 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 499 బేళ్ల కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 412 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.281, కనిష్ట ధర రూ.159, సరాసరి ధర కేజీ రూ.232.76 గా నమోదైంది. వేలంలో 27 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య సందర్శించారు.


# చదువు ఒంటరైంది..

ప్రాథమిక విద్య విద్యార్థులకు కీలకమైన దశ. చదువులో బలమైన పునాది పడితేనే జీవితంలో నిలదొక్కుకోగలుగుతారు. విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వ విద్యను నీరుగార్చి ప్రైవేటు విద్యా రంగానికి ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటోందన్న విమర్శలున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు చాలా మంది ఆసక్తి చూపించడంలేదు. జిల్లాలోని 545 పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు సేవలందిస్తుండడం ఇందుకు నిదర్శనంగా ఉంది.

సాక్షి ఫోకస్

### 74 మంది విద్యార్థులు.. టీచర్ ఒక్కరే

పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 74 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడు. 1వ తరగతి విద్యార్థికి పలక మీద ఏబీసీడీలు రాసివ్వడం దగ్గర నుంచి 5వ తరగతి విద్యార్థికి ఇచ్చిన హోం వర్క్‌ను పరిశీలించడం వరకు ఆ ఒక్క టీచరే చూసుకోవాలి. అన్నీ తరగతులకు ఒక్కడే పాఠాలు బోధించాల్సి రావడంతో వేర్వేరు గదుల్లో కాకుండా రెండేసి తరగతుల విద్యార్థులను ఒకేచోట కూర్చోబెట్టి చదువు చెప్పాల్సి వస్తోంది. ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఈ పాఠశాల ఉంది. ఒకే ఉపాధ్యాయుడితో విద్యార్థుల చదువులు కొండెక్కే పరిస్థితి ఉన్నా విద్యాశాఖ అధికారులకు పట్టడంలేదు. ముందు వెనకా ఆలోచించకుండా ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. వాస్తవానికి గతేడాది వరకు ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు పని చేసేవారు. విద్యాశాఖ అడ్డగోలు చర్యలతో ఒక్కరే మిగిలిపోయారు.



గుండంచర్ల ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులు

- చిన్నారులకు పునాది దశలోనే నిర్లక్ష్యం
- జిల్లాలో 545 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- ప్రాథమిక విద్య దశ నుంచే అవస్థలు ప్రారంభం
- ఒకటి నుంచి 5వ తరగతులకు ఒక్కరే బోధించాల్సి రావడంతో ఇబ్బందులు
- అత్యధికంగా కనిగిరి నియోజకవర్గంలో 121 స్కూళ్లలో ఒక్కరే టీచర్
- సెలవు పెడితే విద్యార్థుల చదువులు గోవిందా
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అడ్డగోలు నిర్ణయాలతో అగమ్యగోచరంగా విద్యార్థుల చదువులు

**సాక్షి ప్రతినిధి, ఒంగోలు:** జిల్లాలో 1795 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో సుమారు 64,196 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో 545 స్కూళ్లకు ఏకోపాధ్యాయ పాఠశాలలు నడుస్తున్నాయి. స్కూలు నిర్వహణతో పాటు విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు, లెక్కలు ఇలా అన్ని సబ్జెక్టులను ఒక్కరే బోధించాల్సి వస్తోంది. కనీసం ఇద్దరు ఉండాల్సిన చోట ఒక్కరే ఉండడం గమనార్హం. దీనిని చూస్తే చదువెలా సాగుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 121 ఏకోపాధ్యాయ స్కూళ్లు ఉన్నాయి. మండలాల వారీగా కనిగిరిలో 22, హెచ్‌ఎంపాడులో 28, వెలిగండ్లలో 15, సీఎస్‌పురంలో 19, పామూరులో 25, పీసీపల్లిలో 12 పాఠశాలల్లో ఒక్కరే ఉపాధ్యాయుడు. ఇక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ప్రాతినిథ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలో 75 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. పొన్నలూరు మండలంలో అత్యధికంగా 20, కొండపిలో 19, మర్రిపూడి 11, టంగుటూరులో 10, జరుగుమల్లిలో 8, సింగరాయకొండ మండలంలో 7 పాఠశాలల్లో అన్నీ తరగుతుల విద్యార్థులకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడు చదువు చెప్పాల్సి వస్తోంది. బింగినపల్లి పాఠశాలలో 21 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఒక్క ఉపాధ్యాయుడే ఉన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో 53 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. మార్కాపురం మండలంలో 12, కొనకనమిట్ల మండలంలో 30, పొదిలి మండలంలో 7 పాఠశాలలు ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. దర్శి నియోజకవర్గంలో 84, గిద్దలూరు నియోజకవర్గంలో 77, యర్రగొండపాలెం నియోజకవర్గంలో 67 పాఠశాలలు ఒక్కడే ఉపాధ్యాయుడు ఉన్నారు.

### 20 మంది దాటినా ఒక్కరే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 మంది విద్యార్థులు దాటితే ఒక హెడ్ మాస్టర్‌తో సహా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ జిల్లాలో అనేక పాఠశాలల్లో 20 మంది విద్యార్థుల కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ ఒక్క ఉపాధ్యాయుడితోనే బడిని నెట్టుకొస్తున్నారంటే పాలకులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. యర్రగొండపాలెంలోని తమ్మడపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 125 మంది విద్యార్థులుండగా ఒకే ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. ఇంత మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఎలా చదువు చెప్పగలడో పాలకులకే ఎరుక. సింగరాయకొండ మండలంలోని బింగినపల్లి ప్రాథమిక పాఠశాలలో 21 మంది విద్యార్థులు చదువుకుంటున్నా ఇక్కడ ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. బేస్తవారిపేట, అర్ధవీడు, కొమరోలు మండలాల్లో 13 పాఠశాలల్లో 20 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు చదువుకుంటున్నా ఒక్క ఉపాధ్యాయుడిని నియమించడం గమనార్హం.



యర్రగొండపాలెం మండలంలోని మొగుళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ..



సింగరాయకొండ మండలం బింగినపల్లిలో 5 తరగతులకు ఒకే గదిలో...

### సెలవు పెడితే ఇక అంతే...

జిల్లాలోని ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏదైనా అత్యవసర పనుల మీద సెలవు పెట్టాల్సి వచ్చినప్పుడు పక్క స్కూలు నుంచి డిప్యుటేషన్ మీద మరో ఉపాధ్యాయుడిని నియమించే అవకాశం కూడా ఉండడం లేదని సమాచారం. దాంతో టీచర్ సెలవు పెడితే విద్యార్థులకు కూడా అప్రకటిత సెలవు ఇచ్చేస్తున్నట్లు తెలుస్తోంది.

### చదువుతో పాటుగా పర్యవేక్షణ ఎలా..

ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి చదువు చెప్పడం ఎంత కష్టమో వారిని పర్యవేక్షించడం కూడా అంతకన్నా కష్టమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకరికి ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్న స్కూళ్లో ఈ సమస్యను ఎదుర్కోవడం పెద్ద కష్టమేమీ కాదు కానీ ఏకోపాధ్యాయ స్కూళ్లలో పర్యవేక్షణ చేయలేక ఉపాధ్యాయులు చేతులెత్తేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య లభించడం గగనమైపోతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



హెచ్‌ఎం పాడు మండలం కూటగుండ్ల ఎంపీపీ స్కూల్

# మీకోసంలో సమస్యల వెల్లువ



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం ఇస్తున్న ఆల్ ఇండియా యాదవ మహాసభ నాయకులు



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న వ్యాయామ విద్యా పోరాట సమితి నాయకులు

- యాదవ భవన్ భూమిని అలానే ఉంచాలి...
- వ్యాయామ ఉపాధ్యాయుల నకిలీ సర్టిఫికెట్లు పరిశీలించాలి
- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు విజ్ఞాపనలు

**ఒంగోలు సబర్బన్:** శ్రీ కృష్ణకళ్యాణ మండపం-యాదవ భవన్ నిర్మాణానికి స్థలం మంజూరు చేస్తూ మునిసిపల్ కార్పొరేషన్ చేసిన తీర్మానాన్ని పరిగణలోకి తీసుకొని ఆ భూమిని మళ్లీ ఇతర శాఖలకు కేటాయించకుండా చూడాలని ఆల్ ఇండియా యాదవ మహాసభ నాయకులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వాళ్ల సమస్యలను అర్జీల రూపంలో కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యాదవ సామాజిక సేవా సంస్థ నిర్వాహకులు, జిల్లా యాదవ సంఘ నాయకులు ఆలిండియా యాదవ మహాసభ జనరల్ సెక్రటరీ కటారి శంకర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిశారు. ఒంగోలు తహశీల్దార్ నివేదిక ఆధారంగా పెళ్లూరులో 70 సెంట్ల భూమిని సర్వే నెం.78/1లో యాదవ భవన్ కోసం మంజూరు చేశారని, దీనికి కౌన్సిల్ ఆమోదం తెలిపారని, భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారని చెప్పారు. అయితే తమకు కేటాయించిన స్థలంలో కొంత భాగాన్ని తాజాగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించి శంకుస్థాపన చేశారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా దాదాపు మూడు లక్షల మంది యాదవుల మనోభావాలకు అనుగుణంగా శ్రీ కృష్ణ కళ్యాణ మండపం-యాదవ భవన్‌కి కేటాయించిన స్థలాన్ని యధాతథంగా ఉంచి, కౌన్సిల్ తీర్మానాన్ని కొనసాగించాలని కోరారు.

**వ్యాయామ ఉపాధ్యాయుల నకిలీ సర్టిఫికెట్లు పరిశీలించాలి:**

2025 సంవత్సరంలో జరిగిన మెగా డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయుల (ఎస్ఏ పీఈ అండ్ పీఈటీ) నకిలీ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్యా పోరాట సమితి నాయకులు కలెక్టర్‌కు మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల కోసం చాలామంది అభ్యర్థులు వ్యాయామ విద్య శిక్షణ పూర్తిచేయకుండా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ నేరుగా పరీక్ష రాసి సర్టిఫికెట్లు పొందారన్నారు. అదేవిధంగా 4వ సెమిస్టర్ విద్యార్థులకు అవకాశం లేనప్పటికీ తప్పుడు సమాచారాన్ని దరఖాస్తులో నమోదు చేసి పరీక్ష రాశారన్నారు. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని వ్యాయామ విద్యా అభ్యర్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు సంపాదించిన వారి సర్టిఫికెట్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల ఆధార్ కార్డు నుంచి వారి పీఎఫ్ అకౌంట్ వివరాలు సేకరించి, అనర్హులైన వారి సర్టిఫికెట్లు రద్దుచేసి వ్యాయామ విద్య శిక్షణ తీసుకున్న నిరుద్యోగులకు న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు.

**తల్లికి వందనం కోసం తిప్పుకుంటున్నారు**

తల్లికి వందనం పథకం కోసం కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఒంగోలు రూరల్ మండలం ఉలిచి గ్రామానికి చెందిన బుర్రా రాజేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. తన పెద్ద కుమారుడు బుర్రా శశి కుమార్ కోసం భార్య అనితా దేవికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్లతో ఉలిచి సచివాలయంలో దరఖాస్తు చేశామన్నారు. తల్లి ఆధార్ మ్యాపింగ్ వేరే వారితో జరిగిందని తిరస్కరించారని చెప్పారు. టెక్నికల్ సమస్యను పరిష్కరించకుండా తిప్పుకుంటున్నారని, సమస్య పరిష్కరించాలని కోరారు.

**మా ఆస్తులు లాక్కున్నాడు:**

వరుసకు బావ అయిన భువన కాశిరెడ్డి తమ ఆస్తులు బలవంతంగా లాక్కున్నాడని మర్రిపూడి మండలం గంగపాలెం గ్రామానికి చెందిన భువన కోటేశ్వరమ్మ తన ఇద్దరు మానసిక వికలాంగులైన పిల్లలతో కలిసి వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తన భర్త భువన బ్రహ్మయ్య 2003వ సంవత్సరంలో చనిపోయాడని, అప్పటి నుంచి మానసిక వికలాంగులైన కుమారుడు రామాంజనేయులు, కుమార్తె రమాదేవిలను తన వద్ద ఉంచుకొని జీవనం సాగిస్తున్నానని వెల్లడించింది. అయితే తన సమీప బంధువు భువన కాశిరెడ్డి తనకున్న ఇల్లు, పొలం, దొడ్డి స్థలాలను బలవంతంగా లాక్కున్నాడని విలపించింది. చివరకు పిల్లలను సాకే స్థోమత లేక వారిని గుంటూరులోని అనాథ శరణాలయంలో ఉంచాల్సిన పరిస్థితి దాపురించిందని కన్నీరుమున్నీరైంది. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకుంది.

# పిల్లలకు ఉడికీ, ఉడకని భోజనం



అన్నం ఉడకలేదని చెబుతున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పక్కన కాకుమాని, పార్టీ నాయకులు

● అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

**ఒంగోలు వన్‌టౌన్:** ఉడికీ, ఉడకని అన్నం పిల్లలకు పెడుతున్నారని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒంగోలులోని మంగమూరు రోడ్డులో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన సోమవారం రాత్రి పరిశీలించారు. వసతి గృహంలో ప్రతి గదిని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ స్వయంగా పిల్లలకు వడ్డించే భోజనం తిని సరిగ్గా ఉడక్కపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తన సొంత డబ్బులతో పిల్లలకు భోజనం తెప్పించారు. వసతి గృహం పై రెండు సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేశారని, దీని వలన పిల్లలపై రేడియేషన్ ప్రభావం పడుతుందన్నారు. మంచినీటిని పిల్లలే బయట నుంచి తెచ్చుకుంటున్నారన్నారు. ప్రతి గదిలో చిన్న లైటు ఒకటి మాత్రమే ఉందని, తాము పరిశీలిస్తున్న సమయంలోనే ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. మొదటి అంతస్తు ఫ్లోర్ విద్యార్థులు నడిస్తే ఊగిపోతుందని విద్యార్థులు తెలపడంతో పరిశీలించారు. వర్షం పడితే విద్యార్థులు కనీసం విశ్రమించడానికి కూడా వీలు లేకుండా గది మొత్తం వర్షం నీటితో ఉండిపోయే పరిస్థితి ఉందన్నారు. 99 మంది విద్యార్థులకు 6 బాత్రూంలు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రతి నెలా విద్యార్థులకు చెల్లించాల్సిన కాస్మొటిక్ చార్జీలను కూటమి ప్రభుత్వం గత డిసెంబర్ నుంచి విద్యార్థుల ఖాతాలకు జమ చేయడంలేదన్నారు. విద్యార్థులను ప్రతి వారం వైద్యులు చెకప్ చేయాలని అలా జరగడంలేదని, పైగా హాస్టల్‌లో గడువు తీరిన మందులు ఉన్నాయని, వీటినే విద్యార్థులకు అందిస్తున్నారని చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నగంటి చైతన్య, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జోనల్ ఇన్‌చార్జి దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, ప్రకాశం జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పల్నాటి రవీంద్రరెడ్డి, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్ చంద్, విక్రమ్, వేణు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

**మంత్రి సవాల్‌ను స్వీకరిస్తాం**

రాష్ట్రంలో ఏహాస్టల్ బాగోలేదో చెప్పాలన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సవాల్‌ను తాము స్వీకరిస్తామని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అన్నారు. ఒంగోలు మంగమూరు రోడ్డులోని బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రి రాష్ట్రంలోని ఏ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని పరిస్థితులను పరిశీలించలేదన్నారు. నారా వారి స్పెషల్ బొద్దింక భోజనాన్ని వసతి గృహంలో విద్యార్థులకు అందించారని, దీనికి సాక్ష్యం హోం మంత్రేనన్నారు. జగనన్న గోరు ముద్దలను ఘోర ముద్దలుగా కూటమి ప్రభుత్వం మార్చిందన్నారు. జగనన్న రూ.7245 కోట్లు ఖర్చు పెట్టి విద్యార్థులకు పోషకాహారం అందించారని చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పీ చైతన్య మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్ సంక్షోభ హాస్టల్స్‌గా మారాయన్నారు. డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సినిమా టిక్కెట్లు పెంచమని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు కానీ విద్యార్థుల కాస్మొటిక్ చార్జీలను పెంచడంలేదన్నారు. జిల్లాకు చెందిన మంత్రి బాలవీరాంజనేయ స్వామి రూ.149 కోట్లు హాస్టళ్ల మరమ్మతులకు విడుదల చేసినట్లు ప్రకటించినా ఎక్కడా మరమ్మతులు జరగలేదన్నారు. విద్యార్థులకు ఇంత వరకూ బెడ్ షీట్లు అందించలేదని చెప్పారు.

## తల్లికి వందనం సమస్యలు పరిష్కరించాలి

● మండల స్థాయి అధికారులను ఆదేశించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు సబర్బన్:** తల్లికి వందనం పథకంలో గ్రీవెన్స్‌లను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. అభివృద్ధి సంబంధిత కార్యక్రమాలపై సోమవారం ఆమె ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తల్లికి వందనం పథకంలో ఈ-కేవైసీలను మంగళవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. హౌసింగ్ పథకంలో ప్రతివారం స్పష్టమైన పురోగతి ఉండాలని స్పష్టం చేశారు. పలు మండలాలలో ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఇది ప్రభావం చూపుతున్నదని హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. చురుకుగా ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఈ బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. పీ-4 పథకంలో మార్గదర్శకులను త్వరగా గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టడానికి అధిక ప్రాధాన్యమిచ్చి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పల్లె పండుగ-2 లో భాగంగా ప్రభుత్వం మన జిల్లాకు 1,458 క్యాటిల్ షెడ్స్‌ను లక్ష్యంగా నిర్దేశించినందున వీటికి త్వరగా అనుమతులు తీసుకుని నిర్మాణ పనులు చేపట్టేలా దృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు, జెడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీ.డీ. జోసఫ్ కుమార్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సీపీఓ స్వరూప రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్ పోస్టర్ ఆవిష్కరణ**

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్ స్టాప్ సెంటర్ ద్వారా ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్ సెంటర్ పోస్టర్‌ను సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివాహం చేసుకోబోయే జంటలకు వివాహం తర్వాత ఎదుర్కోబోయే పరిస్థితుల గురించి, పిల్లల పెంపకం వంటి అంశాలపై ఈ కౌన్సెలింగ్‌లో చర్చిస్తారన్నారు. దీని ద్వారా విడాకులు తీసుకొనే జంటల సంఖ్యను తగ్గించొచ్చని, సంతోషకరమైన కుటుంబ వ్యవస్థ ఏర్పడటానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ సువర్ణ, సఖీ అడ్మిన్ జ్యోతి సుప్రియతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బీసీ వసతి గృహంలో దారుణమైన పరిస్థితులు

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ డైరెక్టర్

**ఒంగోలు వన్‌టౌన్:** జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై ‘సాక్షి’లో వచ్చిన కథనానికి స్పందించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ డైరెక్టర్ బత్తుల పద్మావతి సోమవారం సాయంత్రం ఒంగోలు మంగమూరు రోడ్డులోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అనేక విషయాలను గుర్తించారు. పిల్లలతో ముచ్చటించారు. వసతి గృహంలో విద్యార్థులంతా నేలపైనే పడుకుంటున్నారని, తగినన్ని బాత్రూంలు లేవన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలేదని భోజనాన్ని పరిశీలించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులకు సరైన మందులు ఇవ్వడంలేదని, గడువు తీరిన మందులను కూడా గుర్తించారు. కరెంటు స్విచ్ బోర్డులు పాడైపోయి, పగిలిపోయాయన్నారు. విద్యార్థులకు అందే విధంగా స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. విద్యార్థుల వసతి గృహం పైనే రెండు కంపెనీలకు సెల్ టవర్‌లను ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న బత్తుల పద్మావతి

# కూటమి ప్రభుత్వం మోసానికి కేరాఫ్ అడ్రస్

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ

**తాళ్లూరు:** మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా కూటమి ప్రభుత్వం మారిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల హామీలను వంద శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. తాళ్లూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించి బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను గాలికి వదిలేసిందని, ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కూటమి పార్టీల నాయకులు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం పేరుతో గ్రామాల్లో పర్యటిస్తుంటే.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం అమలు చేసిన కొన్ని హామీలు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసినవేనని తెలిపారు. కరోనా విపత్తు సమయంలో కూడా ఇచ్చిన అన్ని హామీలను ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా అమలు చేశారని వివరించారు. కానీ, కూటమి ప్రభుత్వంలో అమరావతి కోసం లక్షల కోట్ల రూపాయలు అప్పుగా తీసుకొచ్చిన డబ్బులు ఏం చేశారో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. మోదీ మెప్పు కోసం రూ.300 కోట్ల ప్రజాధనాన్ని యోగాంధ్ర పేరుతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ దుర్వినియోగం చేశారని బూచేపల్లి ఆరోపించారు. రూ.300 కోట్లు పెట్టి వైజాగ్‌లో గత ప్రభుత్వం నిర్మించిన భవనాలను ఉపయోగించుకోవడం వారికి చేతకావడంలేదని విమర్శించారు.

**మహిళలకు మాయమాటలు...**

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ చంద్రబాబు 2014 ఎన్నికల్లోనూ పొత్తుతో వచ్చి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేశారని గుర్తుచేశారు. 2019లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భారీ గెలుపు చూసి భయంతో 2024లోనూ మళ్లీ కూటమి కట్టి ఈవీఎంల ట్యాపరింగ్‌లు చేసి గెలిచారని, ఇప్పుడు కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి మోసం చేశారని మండిపడ్డారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు రూ.18,000, మూడు గ్యాస్ సిలిండర్లు వంటి హామీలేవీ నెరవేర్చకుండా మాయమాటలు చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు.

**నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం...**

కూటమి నాయకులు పెడుతున్న అక్రమ కేసులకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భయపడవద్దని, ప్రతి వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్యకర్తకు తాము అండగా ఉంటామని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ హామీ ఇచ్చారు. 2029లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, అప్పటి వరకు ప్రతి ఒక్కరూ ధైర్యంగా కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, ఐవీ సుబ్బారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఆదాం షరీఫ్, మండల ఉపాధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, ఆలోకం హరిబాబు, అనుబంధ విభాగాల అధ్యక్షులు కొర్రపాటి విష్ణు, కైపు అశోక్‌రెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, గోవిందరాజు, మాయర్తి ప్రభుదాస్, నాగళ్ల గోపి, నాగళ్ల వెంకట్రావు, లతీఫ్, రమణారెడ్డి, సర్పంచ్‌లు మందా శాంసన్, షేక్ వలి, మంచాల వెంకటేశ్వరరెడ్డి, చిమట సుబ్బారావు, బొడ్డు రాములు, ఎంపీటీసీలు యోహాన్, పుల్లమ్మ, కోటయ్య, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల నాయకులు యత్తపు మధుసూదన్‌రెడ్డి, కటకంశెట్టి శ్రీను, దేవదానం, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జయరామిరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సభ్యులు, నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

# ఎఫ్ఆర్ఎస్‌తో ముప్పుతిప్పలు


అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు


గిద్దలూరులో యాప్‌ల భారం తగ్గించాలని సీడీపీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు (ఫైల్)

- పోషణ ట్రాకర్ ద్వారానే సరుకులు ఇవ్వాలని కేంద్రం నిబంధన
- ఫేస్ యాప్‌లు సరిగా పనిచేయక అవస్థల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు
- పౌష్టికాహారం పంపిణీలో ఇక్కట్లు
- నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

**బేస్తవారిపేట:** ఎన్నికల సమయంలో జీతాలు పెంచుతామని అంగన్‌వాడీ కార్యకర్తలకు కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీతాలు పెంచకపోగా పనిభారం పెంచారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే సమాచారాన్ని రెండు యాప్‌ల్లో నమోదు చేయమనడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే బాలసంజీవని ద్వారా లబ్ధిదారులకు ఫేస్ యాప్ ద్వారా రేషన్ ఇస్తుండగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ యాప్‌లో కూడా లబ్ధిదారుల ఫేస్ గుర్తింపు నిబంధనను తప్పనిసరి చేయడంతో కార్యకర్తలు రెండు యాప్‌లు నిర్వహించాల్సి వస్తోంది. ఆ యాప్‌ల గురించి ముందుగా శిక్షణ ఇప్పిస్తే ఫలితం ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు 7–36 నెలల పిల్లలకు ప్రతి నెలా పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల వివరాలను పోషణ యాప్, బాలసంజీవని యాప్‌లలో నమోదు చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. టీహెచ్‌ఆర్(టేక్ హోమ్ రేషన్) అందించాలంటే ఒకే వ్యక్తిని రెండుసార్లు ముఖ యాప్‌ల ద్వారా గుర్తించాల్సి రావడం కూడా ఇబ్బందికరంగా మారినట్లు చెబుతున్నారు.

కార్యకర్తలు లబ్ధిదారులను అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు పిలిపించుకుని పోషణ ట్రాకర్ యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేయాలి. వారికి ఇచ్చిన సరుకుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ సమయంలో సాంకేతికపరమైన ఇబ్బందులు వస్తున్నాయి. నెట్‌వర్క్ సరిగా రాకపోవడం, సెల్‌ఫోన్‌లు సరిగా పనిచేయకపోవడంతో ఈ ఫేస్ యాప్ ఓపెన్ కావడం లేదు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు గర్భిణులు, బాలింతలు గంటల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. సమస్య తీరకుంటే మరోసారి కేంద్రం వద్దకు రావాల్సిందే. గతంలో సంతకాలు తీసుకుని సరుకులు ఇచ్చేవారని, ఈ ప్రభుత్వంలో ఆన్‌లైన్ విధానంలోనే పంపిణీ చేయాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నామని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరుకుల కోసం నాలుగైదు సార్లు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతి నెలా రెండు సార్లు తిరగాలి..**

బాలామృతం, బాలసంజీవని కిట్‌ల కోసం నెలలో మొదటి శుక్రవారం, మూడో శుక్రవారం గర్భిణులు, బాలింతలు టీహెచ్‌ఆర్ కోసం వెళ్లాలి. బియ్యం, కందిపప్పు, ఆయిల్, గుడ్లు, పాలు, బాలామృతం ప్యాకెట్ తెచ్చుకునేందుకు రెండుసార్లు వెళ్లిన సమయంలో యాప్‌లతో సమస్యలు తలెత్తుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ఇచ్చిన సెల్‌ఫోన్‌లు, నెట్ వర్క్ పనిచేయకపోవడంతో ఐదారుసార్లు తిరగాల్సి వస్తోంది.

| | |
|---|---|
| జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు | 2,903 |
| అంగన్‌వాడీ వర్కర్‌లు | 2,853 |
| గర్భిణులు | 9,723 |
| బాలింతలు | 6,201 |
| ప్రీస్కూల్ పిల్లలు | 38,309 |

**15 రకాల రికార్డులు నిర్వహించాలి..**

అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 రకాల రికార్డులు నిర్వహించాల్సి వస్తోంది. దీని వల్ల చిన్నారుల ప్రాథమిక విద్యకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. ఇందులో లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం, పిల్లలు, గర్భిణీలు, బాలింతల వివరాల నమోదు రికార్డులు, ప్రీస్కూల్ అడ్మిషన్ రికార్డులను ప్రతి నిత్యం విధిగా నమోదు చేయాల్సిన పరిస్థితి. వాటితో పాటుగా పిల్లలకు అందించే టీకాలకు సంబంధించిన రికార్డుల రిజిస్టర్, విటమిన్–ఏ రికార్డు, రెఫరల్ సర్వీసెస్ గృహ సందర్శకుల రికార్డులు నిర్వహించాలి. దీంతో పాటు నెలవారీ ప్రాజెక్ట్, కేంద్రాల పరిధిలోని హౌస్ హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్ పంపిణీ రికార్డు నిర్వహించాల్సి వస్తోంది.

**ఒకే యాప్ విధానాన్ని తీసుకురావాలి**



ప్రతిరోజు అంగన్‌వాడీ కార్యకర్తలు రెండు యాప్‌ల్లో వివరాలు నమోదు చేయాల్సి వస్తోంది. ఒకే సమాచారాన్ని రెండు యాప్‌ల్లో నమోదు చేయడం వల్ల సమయం వృథా అవుతోంది. సర్వర్, నెట్‌వర్క్ సమస్యలు వచ్చినప్పుడు గంటల తరబడి లబ్ధిదారులు వేచిఉండాల్సిన పరిస్థితి. సమయమంతా ఆయా యాప్‌ల్లో వివరాల నమోదుకే సరిపోతోంది. అంగన్‌వాడీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంచాలి.

– సరళాదేవి, అంగన్‌వాడీ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షురాలు

## దోచుకున్న సొమ్ము సింగపూర్‌కి..


మాట్లాడుతున్న కాకుమాను రాజశేఖర్, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

**ఒంగోలు సిటీ:** రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు పాల్పడి దోచుకున్న సొమ్ముతో సింగపూర్‌లో పెట్టుబడులు పెట్టేందుకే సీఎం చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడుల ముసుగులో సింగపూర్ వెళ్లారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కాకుమాను రాజశేఖర్ ఆరోపించారు. ఒంగోలు నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014–19 మధ్యలో, 2024 నుంచి ఇప్పటి వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు ఏ రకంగా భూముల దోపిడీకి పాల్పడ్డారో అందరికీ తెలుసన్నారు. అమరావతి పేరుతో 33 వేల ఎకరాలను రైతుల దగ్గర తీసుకుని తిరిగి 45 వేల ఎకరాలు కావాలంటూ ల్యాండ్ పూలింగ్‌కు వెళ్లడం వెనుక పెద్ద కుట్ర దాగిఉందన్నారు. తన ముఖ్య అనుచరులు, పార్టీ నాయకులకు భూములు అప్పగించేందుకే ఈ దోపిడీ జరుగుతోందని ఆయన ధ్వజమెత్తారు. 2019కి ముందు అధికారంలో ఉన్నప్పుడు పెద్ద పెద్ద కంపెనీలకు భూ కేటాయింపులు చేశారని, కేవలం ఒక్క కంపెనీ కూడా పెట్టుబడి పెట్టిన దాఖలాలు లేవని అన్నారు. అమరావతి పేరుతో వేలాది ఎకరాలు సేకరించి ఒక్క శాశ్వత కట్టడం కూడా చేపట్టలేదని, ఇప్పుడు కూడా అదే జరుగుతోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా అమరావతి ప్రాంతంలో ఎలాంటి పురోగతి లేదన్నారు. మూడు పంటలు పండే భూములిచ్చేందుకు సిద్ధంగా లేమని రైతులు స్పష్టం చేస్తున్నారన్నారు. తాజాగా విశాఖ బీచ్‌లో విలువైన భూములు కాజేసేందుకు పెద్ద ఎత్తున దందా జరుగుతోందని ఆయన ఆరోపించారు. విజయవాడ విద్యాధరపురం ఆర్టీసీ బస్టాండ్‌లో 4.15 ఎకరాల ఆర్టీసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడం అన్యాయమన్నారు. రూ.156 కోట్ల పెట్టుబడుల కోసం పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందన్నారు. పెట్టుబడిదారులు, వ్యాపారస్తుల కోసం ప్రజల్ని ఇబ్బందులు పెట్టే విధంగా బస్టాండ్‌ను గొల్లపూడి ఎలా తరలిస్తారని నిలదీశారు. చంద్రబాబు ఈ విధంగా అరాచకపాలన సాగిస్తున్నారని రాజశేఖర్ ధ్వజమెత్తారు. వ్యాపార సంస్థలేమీ సేవా సంస్థలు కాదన్నారు. ఇష్టారాజ్యంగా వారికి కేటాయింపులు చేయడం సరికాదన్నారు. వారి దగ్గర నుంచి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. ఒంగోలులో కూడా ఏ విధంగా భూములు ఆక్రమిస్తున్నారో చూస్తున్నామన్నారు. వీటన్నింటిపై వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా విచారణ జరుపుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, వలంటీర్ల విభాగం అధ్యక్షుడు నాటారు జనార్దనరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శ్యాంసాగర్, నాయకులు గౌతమ్, పెట్లూరు ప్రసాద్, 13వ డివిజన్ అధ్యక్షుడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



# నేతల విగ్రహాలకు ఎసరు..!

- మాజీ ప్రధాని పీవీ, మాజీ సీఎం కొణిజేటి విగ్రహాల తొలగింపునకు కుట్ర
- మేయర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు రూ.కోట్ల కుమ్మరింపు
- నేడు ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం

**ఒంగోలు సబర్బన్:**

నగరంలో గతంలో నెలకొల్పిన నాయకుల విగ్రహాలకు తంటా వచ్చి పడింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఆ విగ్రహాల మీదనే టీడీపీ నాయకుల కన్ను పడింది. ఒంగోలులోని రంగారాయుడు చెరువు వద్ద ఉన్న మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ముందున్న మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాలు తొలగించేందుకు మంగళవారం జరగనున్న ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఆమోదించేందుకు రంగం సిద్ధం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయంగా మారాయనే కారణంగా ఈ రెండు విగ్రహాలను అక్కడి నుంచి తొలగించాలని నిర్ణయించారు. ఇక కౌన్సిల్ ఆమోదమే తరువాయి.


రంగారాయుడు చెరువు వద్ద ఉన్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం


బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ముందున్న మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహం

**ట్రంకురోడ్డు విస్తరణపై కూటమి పార్టీల్లో భిన్నాభిప్రాయాలు..**

ట్రంకురోడ్డు విస్తరణపై కూటమి పార్టీలు తలో దారిగా వ్యవహరిస్తున్నాయి. ట్రంకురోడ్డు 100 అడుగులు, దర్గా నుంచి బీవీఎస్ హాలు మీదుగా కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ వరకు 80 అడుగులతో విస్తరించాలని నిర్ణయించారు. అయితే 100 అడుగుల విస్తరణ అనేసరికి ట్రంకురోడ్డులోని వ్యాపారులు ఆందోళనకు దిగారు. ఆర్థికంగా కుదేలవుతామని మొత్తుకుంటున్నా అధికారులు మాత్రం మార్కింగ్ ఇస్తూ వస్తున్నారు. ఎమ్మెల్యే దామచర్ల, టీడీపీ కార్పొరేటర్లు 100 అడుగులకు సై అంటున్నారు. జనసేన మాత్రం 60 అడుగులే అంటోంది.

**124 అంశాల్లో 50కిపైగా ముందస్తు అనుమతులే...**

కూటమి ప్రభుత్వంలోని టీడీపీ, జనసేన పార్టీల నాయకుల మధ్య సఖ్యత లేకపోవటంతో ఇంత వరకు స్టాండింగ్ కమిటీ ఊసేలేదు. రూ.50 లక్షల వరకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు మేయర్ సుజాత ముందస్తు అనుమతులిచ్చి ఆ తర్వాత కౌన్సిల్ ఆమోదానికి పెడుతున్నారు. అందులో భాగంగానే ఈసారి మేయర్ సొంత డివిజన్ అయిన 18వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు రూ.కోట్లు కుమ్మరించుకోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రూ.15 లక్షలు ఎగ్గొట్టిన వ్యక్తికే తిరిగి ఎన్‌టీఆర్ కళాక్షేత్రం...**

ఎన్‌టీఆర్ కళాక్షేత్రం నిర్వహణ బాధ్యతలను గతంలో రూ.15 లక్షలు ఎగ్గొట్టిన వ్యక్తికే తిరిగి కట్టబెట్టనున్నారు. గతంలో లీజుకు తీసుకున్న వై.త్రిశంకరరావు రూ.15 లక్షలు బాకీ పడి అవి కట్టకుండానే కళాక్షేత్రంలోని అన్ని సామాన్లు పీక్కెళ్లాడు. చివరకు బ్యాంకు గ్యారంటీని కూడా డ్రా చేసుకున్నాడు. వీటన్నింటికీ నగర పాలక సంస్థ అధికారుల అండదండలున్నాయి. అధికార పార్టీకి చెందిన ముఖ్య నేత అండదండలతో తిరిగి ఎన్‌టీఆర్ కళాక్షేత్రం నిర్వహణను కారు చౌకగా అతని బినామీకే కట్టబెట్టనున్నారు. నెలకు రూ.80,315 అద్దె నిర్ణయించి చివరకు రూ.38,150కు మాత్రమే కట్టబెట్టే అంశాన్ని కూడా కౌన్సిల్‌లో ఆమోదానికి పెట్టారు.

## అధికార పార్టీ నాయకులే అధికారులా..?

● పేర్నమిట్టలోని రేషన్ షాపుపై తహసీల్దార్‌కు స్థానికుల ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న పేర్నమిట్ట గ్రామస్తులు


అధికారులు లేకుండా అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రేషన్ దించుతున్న దృశ్యం

**సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్):** రేషన్‌షాపు నిర్వహణ సక్రమంగా లేదంటూ సంతనూతలపాడు తహసీల్దార్‌కు పేర్నమిట్ట వాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. బత్తుల శ్రీను, మట్టిగుంట చిరంజీవి, తదితరులు పేర్నమిట్ట గ్రామంలోని 28వ నంబర్ రేషన్ దుకాణంపై ఫిర్యాదు చేశారు. గత సంవత్సరం నవంబర్‌లో 6ఏ కేసు నమోదు చేయగా, అప్పటి నుంచి వీఆర్‌ఓ లాగిన్ ద్వారా రేషన్ ఇస్తున్నారని, కానీ, సోమవారం వీఆర్‌ఓ రాకుండా ఆ షాపులో అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సరుకు దింపుతున్నారని తెలిపారు. స్థానికులు అడ్డగించి తగిన చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

## ఉపాధ్యాయునిపై విచారణకు త్రీమెన్ కమిటీ

**సింగరాయకొండ:** మండలంలోని ఊళ్లపాలెం జెడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసేందుకు డీఈఓ కిరణ్‌కుమార్ త్రీమెన్ కమిటీ వేసినట్లు ఎంఈఓ–1 కె.శ్రీనివాసులు తెలిపారు. ఈ కమిటీలో ఒంగోలు డిప్యూటీ డీఈఓ, సింగరాయకొండ ఎంఈఓ–1, ఒంగోలు జీసీడీఓ సభ్యులుగా ఉంటారన్నారు. ఈ కమిటీ త్వరలో విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తుందని చెప్పారు.

# ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5.5 లక్షల వసూలు

**ఒంగోలు టౌన్:** తన కుమారుడికి మున్సిపాలిటీలో ఉద్యోగంతో పాటు ఇళ్లు ఇప్పిస్తానని చెప్పి గిద్దలూరుకు చెందిన ఒక వ్యక్తి రూ.5.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని అదే పట్టణానికి చెందిన బాధితుడు ఎస్పీ దామోదర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. తన వద్ద నుంచి డబ్బు వసూలు చేసిన వ్యక్తి తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించలేదని, కనీసం ఇళ్లు కూడా ఇప్పించకపోవడంతో మోసపోయామని గుర్తించామని చెప్పారు. డబ్బులు తిరిగివ్వమని అడిగితే నీకు చేతనైంది చేసుకో.. అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయారు. అదేవిధంగా పాత ట్రాక్టర్ ఇప్పిస్తానని చెప్పి కడప జిల్లా దువ్వూరు మండలానికి చెందిన ఒక వ్యక్తి రూ.1.80 లక్షలు తీసుకున్నాడని, రోజులు గడుస్తున్నా ట్రాక్టర్ ఇవ్వడం లేదని దర్శి మండలానికి చెందిన బాధితుడు ఫిర్యాదు చేశాడు. మొత్తం 84 ఫిర్యాదులు రాగా, బాధితులతో నేరుగా ఎస్పీ మాట్లాడారు. ఫిర్యాదులపై ఆయా పోలీసుస్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ దుర్గా ప్రసాద్, డీటీసీ సీఐ షమీముల్లా, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

**ఒంగోలు టౌన్:** అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన ఒంగోలు మండలంలోని కరవది గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెన్నుబోయిన గంగాధర్ (36) గొర్రెల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం రాత్రి బైకుపై ఒంగోలు బయలుదేరాడు. తెల్లవారుజామున కరవది–వలేటివారిపాలెం గ్రామాల మధ్య రోడ్డు పక్కన నిర్జీవంగా పడి ఉన్నాడు. మద్యం మత్తులో బైకుపై నుంచి పడి మరణించి ఉంటాడని భావించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. అయితే ఇది సహజ మరణమా.. లేక ఎవరైనా వాహనంతో ఢీకొట్టి చంపేశారా అనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఒంగోలు తాలూకా పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.